
# సత్యవాక్కు




## క్రైస్తవ మాస పత్రిక

# క్రీస్తు సువార్త మహాసభలు

స్థలము : పాలకొల్లు మునిసిపల్ ఓపెన్ ఎయిర్ థియేటర్

తేదీలు : 1993 ఫిబ్రవరి 23 ఉదయం నుండి
26 రాత్రి వరకు

వాక్యోపదేశకులు : Bro. జాషువా గూటంగారు
(సత్యవాణి రేడియో ప్రసంగీకులు) కాకినాడ
Bro. జి. దేవదానంగారు
(బైబిల్ లెక్చరర్ మరియు మంచి బోధకులు)
మద్రాస్

మరియు అనుభవంగల తదితర సువార్తికులు

అనుదిన కార్యక్రమములు : ఉదయం గం 8-30 to 12.00 వరకు
మధ్యాహ్నం గం 1-30 to 5-00 వరకు
రాత్రి గం 7-30 to 10.00 వరకు

గమనిక : దూరప్రాంతముల నుండి వచ్చు వారికి ఉచిత భోజన సౌకర్యము కలదు. సభలయందు బైబిల్సు, కీర్తనల పుస్తకములు, కేలండర్సు మొ॥ దొరకును

కన్వీనర్ : Bro. యస్. ఎబినేజర్
క్రీస్తు సంఘము, బెత్లెహేము పేట
పాలకొల్లు - 534 260

సభలు జయకరముగా జరుగునట్లు ప్రార్థించండి.

"పాలకొల్లు ఏరియా క్రీస్తు సంఘము లన్నియు మీకు వందనములు చెప్పుచున్నవి"

# సత్యవాక్యం

**THE WORD OF TRUTH**

P.O. Box 80, KAKINADA, A.P, 533 001

Phone : 0884-73722



Editor : J.C. CHOATE

Managing Editor : JOSHUA GOOTAM



Pleading for Restoration of First Century Christianity

సంపుటి 13 ఫిబ్రవరి 1993 సంచిక 7


## సంపాదకీయము

### నీవు ఎటువైపు మొగ్గుచున్నావు ?

### ( Which way are you leaning? )

కొన్ని సామాన్య వృక్షాలు, చిన్న మొక్కలు గాలి ఎటువైపు వీస్తే అటువైపు మొగ్గుతాయి. మరికొన్ని సూర్యరశ్మి వాటికి లభించే దిశకు మొగ్గుతాయి. మానవులు కూడ, వృక్షాలవలె వారిపై పడే ప్రభావాలకు గురి అవుతారు. మనపై అనేకుల ప్రభావం ఉంటాది. మన తలిదండ్రులు, పిల్లలు, భార్య భర్తలు, ఉపాధ్యాయులు, సహచరులు, స్నేహితులు వగయిరాలంతా మన జీవితంలో ఏదోరకమైన ప్రభావం కలిగి యుంటారు. అలాగే మనం యేమి వినుచున్నామో, యేమి చూచుచున్నామో, యేమి చదువుచున్నామో అవికూడ మనల్ని ప్రభావితుల్ని చేస్తాయి. అయితే వృక్షాలవలెగాక మానవులు తమపై ప్రయోగింపబడే ప్రభావాలను గూర్చి కంట్రోలు లేనివారుకారు. మనమేది నిశ్చయించుకొంటిమో దానిని బట్టి చలిస్తాము. మనం సాధారణంగా గైకొనే నిర్ణయాలు, మనపై

ప్రసరించే ప్రభావాలకు లోనై యుంటాయి. ఈ దిగువ సంగతులు గమనించుకొనుము.

1. బాల్యదశలో మనం నడిపించబడిన ప్రభావం గొప్పది. ప్రాముఖ్యమైనది. "మొక్కై వంగనిది మ్రానై వంగునా?" అనే తెలుగు సామెతను మన మెరుగుదుము. ఇది అక్షరాల నిజము. "బాలుడు నడువవలసిన త్రోవను వానికి నేర్పుము. వాడు పెద్దవాడై నప్పుడును దానినుండి తొలగిపోడు" అని సొలొమోను చెప్పాడు. చిన్న వయసులోనే పిల్లలకు దేవునిగూర్చిన సత్యాన్ని యింటిలోను, సంఘములోను ఉపదేశించాలి. యథార్థమైన క్రైస్తవ గృహము యథార్థ క్రైస్తవులను తయారు చేస్తుంది. మంచి చెడుగుల విచక్షణ బాల్యదశలోనే పిల్లలకు గరపాలి. పిల్లలకు ఉపదేశించే బాధ్యత తలి దండ్రులదే.

2. దుష్ప్రభావాలనుండి మనకు రక్షణ అవసరం. కొన్ని చెట్లు-వాటిపై వీచే గాలులు-ఎట్లున్నా తిన్నగానే పెరుగుతాయి. అంటే గాలి ప్రభావం వాటిపై నేరుగా పడకుండా కొండలో, భవనములో, అట్టివేవో వాటికి అడ్డుగా నిలిచాయన్న మాట. తోటలలో పెరుగు చెట్లుకూడ మామూలుగానే యుంటాయి. అయితే ఏకాంతంగా యున్న చెట్లే అటు యిటు మొగ్గుతాయి. అలాగే మనపై పడే దుష్ప్రభావాలనుండి కాపాడడానికి దేవుడు మనకు గృహాన్ని, సంఘాన్ని యిచ్చాడు. గృహాలలో అశాంతి, అలజడ, కొట్లాటలు యుంటే పిల్లలకు అవి భద్రత నియ్యలేవు. భార్య, భర్తలు ఏకీభావము కలిగి యుండాలి. వారిలో ఎడబాటు దుష్ప్రభావాలకు దారితీస్తుంది (ఆది.కా. 2:21-24; మలాకీ 2:16; మత్తయి 19:3-9).

దుష్పరిమాణాలనుండి మనం దూరముగా యుండే నిమిత్తం దేవుడు మనకు తన సంఘాన్ని కూడ యిచ్చాడు. మనము క్రీస్తు

యొక్క శరీరమై యుండి వేరువేరుగా అవయవములై యున్నాము (రోమా 12 : 27). పెద్ద అడవులలో చెట్లు ఎందుకు అంత బలంగా యుంటాయంటే, అవి మిగతా చెట్ల వేళ్ళతో ముడివేసుకొని కలసి పెరుగుతాయి. క్రైస్తవులు విశ్వాసమందు వేరుపారి స్థిరపడి కలిసి నిలబడాలి, పెరగాలి. గృహము, సంఘము క్రైస్తవునికి భద్రత కవచం లాంటివి. వాటిలో లభించే శిక్షణ, ఉపదేశము, బోధ మొదలైనవి అపవాదియొక్క దుష్ప్రభావం నుండి మనలను కాపాడగలవు.

3. మన సహచరులను గూర్చి స్నేహితుల్ని గూర్చి జాగ్రత్తగా యుండాలి. మనపై ప్రయోగించబడే ప్రభావాలనుండి కంట్రోలు లేనివారం కాము. మన మిత్రులను గూర్చి సహచరులను గూర్చి జీవిత భాగస్వాములను గూర్చి మనం సరియైన నిర్ణయాలు తీసుకోవాలి. అలాగే మనం యేమి చదువుచున్నామో, యేమి చూచుచున్నామో, వినుచున్నామో వాటిని గూర్చికూడ మంచి ఎంపిక చేసుకోవాలి. "మోసపోకుడి; దుష్ట సాంగత్యము మంచి నడవడిని చెరుపును" (1 కొరింథీ 15 : 33). నీ స్నేహితులు మంచివారా? చెడ్డవారా? ఎట్లు తెలుసుకోగలవు? మొదటిగా వారికి సరదా పుట్టించేది యేది? వారు బూతులాడతారా? అబద్ధాలు చెబుతారా? పెద్దలంటే గౌరవం లేనివారా ? వారు పోకిరి చేష్టలు చేస్తారా ? అయితే వారి సాంగత్యం నీకు తగదు (ఎఫెసీ 4 : 29; యాకోబు 3:1-10). హృదయంలో యేమి వున్నదో అది నోరు పలుకుతాది అని యేసుప్రభువే చెప్పారు (మత్త 12 : 34). మరల, దేవునిగూర్చి వారి మనస్తత్వం యెట్టిది? భయభక్తులు గలవారా? లేక దానికి వ్యతిరేకులా? ఆయన నామమంటే భయభక్తులులేని వారైతే వారి స్నేహం నీకు తగదు. చివరిగా వారితో యుంటే నీకు మేలని తోస్తుందా? లేదా నీవు కించపరచబడుచున్నావా? వారితో యున్నపుడు నీవు ఆత్మీయంగా వెనుకబడుచున్నట్లయితే నీకు క్రొత్త మిత్రులు అవుసరం !

4. అబద్ధ బోధకులను గూర్చి కనిపెట్టుకొని యుండాలి. అటు యిటు వీచు అబద్ధ బోధలు నేడు అనేకము లున్నాయి (ఎఫెసీ 4:14). క్రీస్తునుండి దూరపరచబడకుండు నిమిత్తము (అపో.కా. 20:29-30), మనం అబద్ధ బోధకులను పరిశోధించాలి (1 యోహాను 4 : 1-2). సంఘములోను, సంఘానికి వెలుపల కూడ అబద్ధ బోధకులున్నారని మనం గమనించాలి. "అందువలన మనమిక మీదట పసిపిల్లలమై యుండి, మనుష్యుల మాయోపాయములచేత వంచనతోను, తప్పు మార్గమునకు లాగు కుయుక్తితోను, గాలికి కొట్టుకొనుపోవునట్లు కల్పించబడిన ప్రతి ఉపదేశమునకు ఇటుఅటు కొట్టుకొనిపోవుచు అలలచేత ఎగురగొట్టబడిన వారమైనట్లుండక, ప్రేమ గలిగి సత్యము చెప్పుచు క్రీస్తువలె యుండుటకు మన మన్ని విషయములలో ఎదుగుదము" (ఎఫెసీ 4:14-15).

— o —

## పరలోక రాజ్యము — ఆవగింజ

## ( The Kingdom of Heaven and Mustard Seed )

పరలోక రాజ్యాన్ని గూర్చి యేసు తరుచు ఉపమానముల ద్వారా బోధించారు. ఆవగింజను గూర్చిన ఉపమానము అందులో ఒకటి. "ఆయన మరియొక ఉపమానము వారితో చెప్పెను. పరలోక రాజ్యము ఒకడు తీసుకొని తన పొలములో విత్తిన ఆవగింజను పోలి యున్నది. అది విత్తనము లన్నిటిలో చిన్నదే గాని పెరిగినప్పుడు కూరమొక్కలన్నిటిలో పెద్దదై ఆకాశ పక్షులు వచ్చి దాని కొమ్మలయందు నివసించునంత చెట్టగును" (మత్త 13:31-32).

ఈ ఉపమానము శిష్యులను ప్రోత్సహించుటకొరకు చెప్పబడినది. యేసుతో కలిసి వారు ఆరంభించిన ఉద్యమం చిన్నదిగా

కనబడినను, కాలము గడిచేకొలది అది ప్రపంచవ్యాప్తమై అత్యంత మేలుకరముగా తయారగునని వారు తెలుసుకొనాలని ప్రభువు ఆశించారు.

చరిత్రనుబట్టి చూస్తే గొప్పగొప్ప ఉద్యమాలన్నీ ఆదిలో చిన్నవిగానే ఆరంభమయ్యాయి. దేవుని రాజ్యము కూడ దాని ఆరంభములో ఆవగింజవలె చిన్నదే. ఆవగింజ విత్తనము లన్నిటిలో చిన్నదే యని యేసుప్రభువు చెప్పారు. మనుష్యులు తమ పొలములో నాటే మిగతా విత్తనాలతో ఆయన ఆవగింజను పోల్చి చెప్పారు. ఆవగింజ చాల చిన్నది.

ఆవగింజ యెట్లున్నదో అట్లే భూమిపై పరలోక రాజ్యారంభము కూడాను. యేసుయొక్క సమకాలికులు ఆయనను గూర్చి పెద్దంత ఎరిగినవారు కారు. ముప్పయ్యో సంవత్సరం వచ్చే వరకు ఆయన నజరేతను చిన్న ఊరిలో బ్రతికారు. దాని పరిసర పట్టణాలలోను, పల్లెలలోను ఆయన మూడున్నర సంవత్సరాలు బోధించారు. తరువాత ఒక అపరాధివలె రోమాదేశపు సిలువపై ఆయన మరణించారు. నాటి కాలములోయున్న అధిపతులతో ఆయనను పోల్చిచూస్తే ఆయన బహు స్వల్పమైన వానిగానే కనబడును.

ఆయన స్థాపించబోయే రాజ్యం సందిగ్ధావస్థలో యుండెను. దాని ముఖ్య కార్యకర్తలుగా 12 మంది విద్యలేని పామరులను ఆయన ఎంచుకొన్నారు. వారికి పెద్ద పేరు ప్రతిభ యేమీలేదు. వారి బోధవలన ఈ మనుష్యులు లోకాన్నంతా తలకిందులు చేసేస్తారని ఎవరు అనుకొంటారు? గాని వారట్లు చేసేసారు!

పరలోక రాజ్యము దాని విస్తరణలో ఆవగింజను పోలియున్నది. ఆవగింజ చిన్నదే అయినను దానినుండి పెద్ద వృక్షము బయలుదేరును. పాలస్తీనా దేశంలో చిన్న ఆవగింజ నుండి మొలకెత్తిన

మొక్క పెద్ద చెట్టువలె ఎదుగును. అది యించుమించు 12 అడుగుల ఎత్తువరకు పెరుగును. సరిగదా వాటి విత్తనాలను తినుటకు ఆ చెట్లు నిండా పక్షులుండును. అందు వలననే యేసుయొక్క రాజ్యము లేక సంఘము ఆవగింజవలె ఆరంభమయినా పెద్ద వృక్షమువలె వ్యాప్తి జెందెను.

ఈ ఉపమానాంశము విపులముగానే యున్నది. పరలోక రాజ్యము సామాన్యముగా ఆరంభమై అది అన్ని దేశాలను ఆవరించుకొని సర్వసామాన్య రాజ్యముగా అభివృద్ధి జెందును. ఈ రాజ్యము అభివృద్ధి జెందునని యేసుకు తెలియును. ఆవగింజవలె, పరలోక రాజ్యముయొక్క విత్తనములో కూడ శక్తి, జీవముగలదు (లూకా 8:11). రాజ్య సువార్తలో దేవుని శక్తి యున్నది (రోమా 1:16). ఆవగింజవలె పరలోక రాజ్యపు విత్తనము కూడ తీసికొని పొలములో నాటబడాలి. మానవుల హృదయాల్లో దేవుని వాక్యం విత్తబడాలి. అందువలననే సువార్త సర్వసృష్టికి ప్రకటింపబడాలని ఆయన ఆజ్ఞాపించారు (మార్కు 16:15). దేవుని రాజ్యము మొలకెత్తి వేరుపారి, అభివృద్ధి జెందాలంటే విత్తనమైన దేవుని వాక్యమును నాటాలి.

పరలోక రాజ్యారంభము సూక్ష్మంగాను, సామాన్యముగాను యున్నను, అది వ్యాపించింది. నేటికిని వ్యాపించుచునే యున్నది. యేసుప్రభువు నిర్దేశించిన మేరకు నమ్మకమైన క్రైస్తవులు విత్తనాలను నాటుచునే యున్నారు. ఆయన రాజ్యము అభివృద్ధి జెందుచునే యున్నది.

—రోయ్ బీస్లీ.

—o—

## పాపము వలన సంతోషము కలుగదు

## ( Sin does not Produce Happiness )

పాపములో మునిగిపోయి సంతోషాన్ని అన్వేషించేవారు అన్ని

వేళళా నిరుత్సాహపడతారు. ఎందువలనంటే పాపం వలన కలిగే పర్యవసానం-నిష్ప్రయోజనమైన పగళ్ళు, వేదనతో కూడిన రాత్రులే. పరిశుద్ధుడైన యెషయా యిట్లు పలికాడు: "భక్తిహీనులు కదులుచున్న సముద్రములాంటివారు. అది నిమ్మళింపనేరదు. దాని జలములు బురదను మైలను పైకి వేయును. దుష్టులకు నెమ్మది యుండదని దేవుడు సెలవిచ్చుచున్నాడు" (యెషయా 57:20, 21).

దుష్టత్వము జరిగించుటకు పట్టుదల కలిగియున్న వారు నిరాశ, నిస్పృహలతో మరణింతురు. ఎందువలనంటే, "జీవముగల దేవుని చేతిలో పడుట భయంకరము" (హెబ్రీ 10:31). "మోసపోకుడి, దేవుడు వెక్కిరింపబడడు; మనుష్యుడు ఏమి విత్తునో ఆ పంటనే కోయును. ఏలాగనగా తన శరీరేచ్ఛలనుబట్టి విత్తువాడు తన శరీరము నుండి క్షయమను పంటను కోయును. ఆత్మను బట్టి విత్తువాడు ఆత్మ నుండి నిత్యజీవమను పంటను కోయును" (గలతీ 6:7, 8).

"ప్రభువైన యేసు తన ప్రభావమును కనుబరచు దూతలతో కూడ పరలోకమునుండి అగ్నిజ్వాలలలో ప్రత్యక్షమై దేవుని నెరుగని వారికిని, మన ప్రభువైన యేసు సువార్తకు లోబడని వారికిని ప్రతి దండన చేయును" (2 థెస్స 1:7-9).

—G.F. రెయిన్స్

— o —

## దుర్మార్గుల విజయము స్వల్పకాలమే
## (The Victory of the Wicked is short)

ప్రకటన 11వ అధ్యాయములో ఆరవ, ఏడవ దూతల బూర శబ్దములకు మధ్య జరిగిన సంఘటన (3-12) వాక్యములలో ఇద్దరు సాక్షులను మనము చూడగలము. వారు 1260 దినములు బహునమ్రతతో ప్రవచించిరి. వారి యొక్క సాక్ష్యము ముగించిన పిమ్మట

అగాధములోనుండి వచ్చు క్రూర మృగము వారితో యుద్ధము చేసి జయించి వారిని చంపును. వారి శవములు అందరూ చూడగల్గునట్లు ఆ మహా పట్టణపు సంత వీధిలో పడి యుండును. వారి శవములను సమాధి చేయగలిగినట్టి గౌరవమును కూడ వారి యెడల లేనందున మూడున్నర దినములు అవి అట్లే యుండిపోయెను. ఆ మూడున్నర దినములైన పిమ్మట దేవునియొద్ద నుండి జీవాత్మ వచ్చి వారిలో ప్రవేశించెను గనుక వారు పాదములు ఊని నిలిచిరి. చివరిగా వారు దేవునితో సదా జీవించుటకు పరలోకమునకు ఆరోహణమైరి.

విశ్వాసులైనవారికి ఉద్రేకము కలిగించు పాఠ మిందున్నది. దుర్మార్గులయొక్క విజయము బహు కొద్ది పాటిది. ఔను, దుర్మార్గులైన వారు కొద్ది కాలము మాత్రమే ప్రబలుదురు. సాతాను ఏదేను తోటలో కొద్ది సమయము మాత్రమే యుండెను. కాని దేవుడు దానిని జయించి మనకు వాగ్దానము నిచ్చెను (ఆది కా. 3:15). యోసేపు యొక్క సహోదరులు కొద్ది సంవత్సరములు మాత్రమే జయించిన వారుగ యుండిరి గాని తరువాత ఐగుప్తు దేశములో వారు యోసేపుకు మ్రొక్కిరి. ఫరో దేవుని జనాంగమైన ఇశ్రాయేలీయులను కొద్ది కాలము మాత్రమే శ్రమ పరచినను దేవుడు తన బలమైన బాహువు చేతను, శక్తి చేతను వారిని ఆ శ్రమలనుండి విడిపించెను. హామాను యూదుల మనస్సులలో భయమును పుట్టించెను. గాని ఒక దినమందు తాను యేర్పాటు చేయించిన ఉరి కొయ్యమీదనే అతడు చంపబడెను. పస్కాకు ముందుగ శుక్రవారం దినమున క్రీస్తు సిలువ వేయబడెను, కాని వారమునకు మొదటి దినమున సమాధిని జయించి ఆయన లేచెను. సంఘము తరుచుగా కొన్ని శ్రమలను, కష్టములను భరించవలెను. కాని దేవుని రాజ్యము యెన్నటికిని నశించదు. దేవుని బిడ్డలైనవారు యెప్పుడూ శ్రమానుభవము గలవారై యుందురు. కాని

క్రీస్తు ప్రభువుయొక్క రెండవ రాకడలో వారు విజయవంతులుగ యుందురు.

పైన చెప్పబడిన ఉదాహరణ లన్నిటియందును కూడ దుర్మార్గులయొక్క విజయము గుర్తించబడినది. కాని అది ప్రతిసారి కూడ చాల కొద్దిపాటి సమయము మాత్రమే యున్నది. చివరకు జయమనేది దుర్మార్గులకు చెందదు. విజయమనేది దేవునియందు విశ్వాసులైన వారికి గల లోతైన అనుభవము. దేవుని నుండి పుట్టినది లోకమును జయించును. "దేవుని మూలముగా పుట్టినవారందరు లోకమును జయించుదురు. లోకమును జయించిన విజయము మన విశ్వాసమే" (1 యోహాను 5:4). మన ప్రభువైన యేసుక్రీస్తు మూలముగ మనకు జయము అనుగ్రహించుచున్న దేవునికి స్తోత్రము కలుగునుగాక (1 కొరింథి 15:57). —విక్టర్ M.E.

—o—

## లోతుయొక్క పతనము
## (Lot's Fall)

లోతుయొక్క పతనమును బైబిలు స్పష్టముగ సూచించుచున్నది. లోతు తన కన్నులెత్తి యోర్దాను ప్రాంత మంతటిని చూచెను (ఆది కా. 13:10). అతని కొరకు యోర్దాను ప్రాంత మంతటిని యేర్పరచుకొనెను. (11 వ) ఆత్మీయ సహవాసములో అబ్రాహామునుండి వేరైపోయెను (11 వ). ఆ మైదానమందున్న పట్టణముల ప్రదేశములలో అతడు కాపురముండెను (12 వ). సొదొమ దగ్గర తన గుడారము వేసికొనెను (12 వ) సొదొమలో అతడు నివసించెను (ఆది కా. 14:12). సొదొమ గవినియొద్ద అతడు కూర్చుండియుండెను. (19:1). ఇది లోతుయొక్క ప్రాముఖ్యతను తెలుపు చున్నది.

లోతు సొదొమ పెద్దలతో ఒకడుగ ఎంచబడెను. అతని కుమా

రైలు ఆ దేశస్థులైన సొదొమీయులను వివాహమాడిరి. ప్రారంభ ములో అతడు ఒక పెద్దమనుష్యుని వలె ఎంచబడి చివరకు ఆ దుర్మార్గ మైన పట్టణమునకు అధిపతిగా అయెను. లోతు నీతిగల వ్యక్తి అని బైబిలు చెప్పుచున్నది. "దుర్మార్గుల కామవికార యుక్తమైన నడవడి చేత బహు బాధపడిన నీతిమంతుడగు లోతును తప్పించెను. ఆ నీతి మంతుడు వారి మధ్యను కాపురముండి తాను చూచిన వాటినిబట్టియు వినినవాటిని బట్టియు, వారి అక్రమమైన క్రియల విషయములో దిన దినము నీతిగల తన మనస్సును నొప్పించుకొనుచు వచ్చెను" (2 పేతురు 2:7-8). కాని అతడు యిహలోక సంబంధమైన దురాశలకు లోనయ్యెను.

పాపము యే విధముగ ఒక్కొక్క మెట్టు క్రిందికి దిగజారిపోవు నట్లు చేయగలదో కీర్తనల గ్రంథకర్త చక్కగ తెలియజేయు చున్నాడు. "దుష్టుల ఆలోచన చొప్పున నడువక, పాపుల మార్గమున నిలువక, అపహాసకులు కూర్చుండు చోటను కూర్చుండక" (కీర్తనలు 1:1) ఇచ్చట నడువక, నిలువక, కూర్చుండక యను ఈ మూడు అంశములను గమనించుదము. మొదటిగ అది దుష్టుల ఆలోచన, తరు వాత అది పాపుల మార్గము, ఆఖరిగ అది అపహాసకులు కూర్చుండు స్థలము. ఇది పతనమునకు లేక నాశనమునకు మార్గము. ఈ కీర్తన గ్రంథకర్త ఈ మార్గముగుండా వెళ్ళనివాడు ధన్యుడని చెప్పుచు న్నాడు. నాశనమునకు పోవు మార్గమునుండి తప్పించబడిన క్రైస్తవుడు యెహోవా కట్టడలయందు ఆనందించును. ఆ కట్టడలను గూర్చి దివా రాత్రము ధ్యానించుచుండును. అతడు నీటి కాలువల యోరను నాట బడిన చెట్టువలె యుండి ఆకు వాడక తన కాలమందు ఫలమిచ్చు చుండును. అతడు చేయునదంతయు సఫలమగును (2-3 వ). కీర్తనలు 1 : 1 లోతు యొక్క పతనమునకు గల మార్గమును సూచించు చున్నది. 2, 3 వాక్యములు క్రైస్తవులమైన మనము ఎపచుకొన

వలసిన మార్గమును తెలియబరచుచున్నది. నీవు ఏమార్గమును ఎంచుకొనుచున్నావు ?

—టామ్. కెట్లన్.

—o—

## పాపమునుండి మనము యెప్పుడు విడుదల పొందుదుము ?

## ( When are we made free from sin ? )

మానవునిగ యేసు చేసిన క్రియలలో, మొదటిదిగ గుర్తించబడిన క్రియ యేది ? (మత్తయి 3 : 13-17). యొర్దాను నదిలో యోహానుచే బాప్తిస్మము పొందుటకు యేసు గలిలయనుండి యొర్దానుకు వెళ్ళెను.

పెంతెకోస్తు దినమున పేతురు తన ప్రసంగము ముగించుచు యిచ్చిన ఆజ్ఞ యేమిటి? పాపక్షమాపణ కొరకు బాప్తిస్మము పొందవలెనని అతడు ఆజ్ఞాపించెను (అపొ. కా. 2 : 38). ప్రజలు యేలాగు ప్రతిస్పందించిరి ? ఎవరైతే దేవుని వాక్యమును సంతోషముతో అంగీకరించిరో వారందరు ప్రభువునామమున బాప్తిస్మము పొందిరి. ప్రభువు యేమిచేసెను? రక్షించబడిన వారినందరిని సంఘమందు చేర్చుకొనెను (అ.కా. 2 : 47).

అది కాండం 8 : 12-13 లో ఫిలిప్పు బోధను అంగీకరించిన సమరయులందరు యేమి చేసిరి? పురుషులు, స్త్రీలు నమ్మిన వారందరు బాప్తిస్మము పొందిరి. అదే పట్టణములో గారడీవాడైన సిమోను యేమి చేసెను ? సీమోను దేవుని నమ్మెను. అతడు బాప్తిస్మము పొందిన పిమ్మట ఫిలిప్పుతో కలసి పనిచేసెను.

ఐతియోపీయుడైన నపుంసకునకు ఫిలిప్పు క్రీస్తును గూర్చి బోధిం

చిన పిమ్మట అతడు ఫిలిప్పును దేనికొరకు అడిగెను ? (అ.కా. 8:36). ఇదిగో నీళ్లు, నాకు బాప్తిస్మమిచ్చుటకు ఆటంకమేమని అడిగెను. ఫిలిప్పు అందుకు అంగీకరించెనా ? (అ.కా. 8 : 38).

తార్సువాడైన సౌలుకు అననీయ యేమి చేయుమని చెప్పెను? అతడు లేచి బాప్తిస్మము పొందెను (అపొ.కా. 9 : 18).

కొర్నేలికి అతని యింటివారికి పేతురు యేసునుగూర్చి బోధించిన పిమ్మట వారికి యేమి చేయుమని ఆజ్ఞాపించెను ? (అ. కా. 10:47-48). యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుమని పేతురు వారి కాజ్ఞాపించెను. అ. కా. 16:15 లో లూదియ యను స్త్రీ పౌలు యొక్క బోధను విని యేమి చేసెను ? ఆమె బాప్తిస్మము పొందెను.

అ.కా.16:32-33లో పౌలును, సీలయును చెరసాల నాయకునికి చేయుమని చెప్పిన విషయమునుగూర్చి అతడును, అతని కుటుంబము వారును యేమి చేసిరి? రాత్రి అ గడియలోనే అతడు వారిని తీసికొని వచ్చివారి గాయములు కడిగెను. వెంటనే అతడును, అతని యింటివారందరును బాప్తిస్మము పొందిరి.

అ.కా. 18 : 8లో కొరింథీయులు సువార్తను విని దాని నంగీకరించిన తరువాత వారు యేమి చేసిరి ? చాలమంది కొరింథీయులు వాక్యమును విని, అంగీకరించి వారు బాప్తిస్మము పొందిరి.

ఎఫెసులోని 12 మంది పరిశుద్ధాత్మను గూర్చియు, యోహాను బాప్తిస్మమును గూర్చియు పౌలు చెప్పిన వివరణను వినిన తరువాత వారు యేమి నిశ్చయించుకొనిరి ? వారు ఆ మాటలు విని ప్రభువైన యేసు నామమున బాప్తిస్మము పొందిరి (అపొ.కా. 19 : 5).

మన ప్రభువైన యేసు పాపము లేనివాడుగా యుండినను నీటిలో బాప్తిస్మమును గూర్చి మాదిరి చూపించుట మాత్రమే గాక ఈ భూలోకములో ఆయనయొక్క ముప్పదిమూడు సంవత్సరముల జీవి

తమును దైవిక సలహాలతో కూడినట్టిదిగా నిరూపించెను. "మీరు వెళ్లి సమస్త జనులను శిష్యులనుగా చేయుడి; తండ్రియొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మమియ్యుడి" (మత్తయి 28:18-20). ఈ కార్యమును పరలోకమందును, భూమిమీదను సర్వాధికారముతో ఆయన జరిగించెను. మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి. నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును (మార్కు 16:15-16).

ఐతియొపీయుడైన నపుంసకుడు ఫిలిప్పు ద్వారా బాప్తిస్మమును పొందిన పిమ్మట యేమిచేసెను? నపుంసకుడు సంతోషించుచు తన త్రోవను వెళ్ళెను (అ. కా. 8 : 39). ఎందుకు? అతని పాపములు క్షమింపబడెను గనుక (అ.కా. 2:38; 22:16). అతడు క్రీస్తునందున్నవాడు (రోమా 6:3-5; కొలస్సి 2:12-13). అతడు క్రీస్తును ధరించుకొనెను (గలతీ 3:27). అతడు క్రీస్తుతో కూడ పాతిపెట్టబడి నూతన జీవము పొందునట్లు లేపబడెను (రోమా 6:3-4; కొలస్సీ 2:12-13; 2 కొరింథి 5:17). అతడు రక్షింపబడెను (మార్కు 16:16; 1 పేతురు 3 : 21).

ఈ విధమైన మాదిరి చూపుటకు దేవుడు ఎందుకు తన్ను తాను వ్యయపరచుకొనెను? మన కొరకు ఆయన కుమారుడు చనిపోవుటకు ఎందుకు అంగీకరించెను? (రోమా 5:8). మనము పాపులముగ యుండుటచే ఆయన కుమారుని మరణమునకు అంగీకరించెను (రోమా 3:23, 1 యోహాను 1:9). క్రీస్తు రక్తము లేనిదే పాపక్షమాపణ, విమోచన లేదు (ఎఫెసి 1:7; కొలస్సీ 1:13-14).

రక్షణ పొందునట్లు బాప్తిస్మము మిక్కిలి అవసరమని క్రొత్త నిబంధన మనకు రూఢిగా తెలియబరచుచున్నది. అనేక ఉదాహరణలద్వారా దేవుడీ విషయమును మనకు తెలియబరచుచున్నాడు.

రక్షింపబడుటకు బాప్తిస్మ యొక్కటి మాత్రమే సరిపోదు. కాని మారుమనస్సు, ఒప్పుకోలు, క్రీస్తు యేసునందలి విశ్వాసము ద్వారా ఆయన కట్టడలను గైకొనుటద్వారా కలుగును (రోమా 6 : 17). అప్పుడు పాపులైనవారు పాపమునుండి విమోచింపబడి క్రీస్తు యేసునందు నీతికి దాసులగుదురు (రోమా 6:18).

—ఫ్రెడ్ డిల్లాన్.

— o —

## సబ్బాతు ఇంకను నిలిచియున్న యెడల....

### ( If the Sabbath is still binding )

శనివారమే సబ్బాతు దినమనియు, క్రైస్తవులు సబ్బాతును ఆదివారమునుకాక శనివారముననే ఆచరించవలెననియు కొందరు బోధకులు ఆయా గ్రామములకు వెళ్ళి బోధించుచున్నట్లును, సబ్బాతు దినముయొక్క సత్యమును తెలిసికొన గోరుచున్నట్లును కొందరు మిత్రులు మాకు ఉత్తరములు వ్రాసారు. సత్యమును అన్వేషించుచున్న ఈ మా మిత్రులను గూర్చి మేము దేవుని స్తుతించుచున్నాము.

శనివారమే సబ్బాతు దినము అను సంగతి ఎవరును కాదనరు. అయితే క్రైస్తవ యుగములో దేవుని ఆరాధించు దినము (సబ్బాతు దినమయిన) శనివారము కానేకాదు. ప్రభువు దినము వారములో ఆఖరి దినముకాక మొదటి దినమై యున్నది. అనేకులు ఆదివారమును సబ్బాతు దినమని పిలుచుచుందురు. గాని అది కేవలము పొరపాటు. ఆదివారము శనివారము ఎట్లుకాదో అట్లే ఆదివారము సబ్బాతు దినము కాదు. సబ్బాతు అనగా విశ్రాంతి అని అర్థము. గనుక మన తెలుగు బైబిలులో 'సబ్బాతు దినము' అని కనబడుటకు బదులు విశ్రాంతి దినము అని కనబడును. ఆ విశ్రాంతి దినము వారములో ఏడవ దినము. దేవుడైన యెహోవా ఇశ్రాయేలీయులను ఇట్లు అజ్ఞా

పించెను: "విశ్రాంతి - దినమును పరిశుద్ధ దినముగా ఆచరించుటకు జ్ఞాపక ముంచుకొనుము. ఆరు దినములు నీవు కష్టపడి నీ పని అంతయు చేయవలెను. ఏడవ దినము నీ దేవుడైన యెహోవాకు విశ్రాంతి దినము" (నిర్గమ 20:8-10).

## కొన్ని ప్రశ్నలు

సబ్బాతు దినము శనివారమని మనము తెలిసికొనిన తరువాత క్రైస్తవులు సబ్బాతును ఆచరించవలెనా? యను ప్రశ్నను మనము ఇప్పుడు చూచుకొందము. దీనిని గూర్చిన సత్యమును మనము తెలిసికొనవలెనంటే అసలు సబ్బాతు దినమును ఎవరు ఎందువలన ఎప్పుడు ఆచరించవలెనని ఆజ్ఞాపింపబడిరో మనము ముందు తెలిసికొనవలెను.

దేవుడు తన సృష్టి పని యంతటినుండి యేడవ దినమున విశ్రమించెనని ఆదికాండము 2:3లో మనకు కనబడుచున్నను, అప్పటి నుండి ఇంచుమించు 2500 సంవత్సరముల తరువాత మాత్రమే సబ్బాతు దినము ఒక ఆరాధన దినముగాను, పరిశుద్ధ దినముగాను ఆచరించవలెనని ఇశ్రాయేలీయులు ఆజ్ఞాపింపబడిరి.

## సబ్బాతు ఎవరికి ?

సబ్బాతును ఆచరించవలెనని ఎవరికి ఆజ్ఞాపింపబడెను? యూదులకు మాత్రమే ఆజ్ఞాపింపబడెను. ఇశ్రాయేలీయులందరు ఐగుప్తునుండి విడుదల పొంది సీనాయి కొండకు వచ్చువరకు సబ్బాతును గూర్చి దేవుడు వారిని ఆజ్ఞాపించలేదు. "మోషే ఇశ్రాయేలీయుల నందరిని పిలిపించి యిట్లనెను. ఇశ్రాయేలీయులారా, నేను మీ వినికిడిలో నేడు చెప్పుచున్న కట్టడలను, విధులను విని వాటిని నేర్చుకొని వాటి ననుసరించి నడువుడి. మన దేవుడైన యెహోవా మనతో నిబంధన చేసెను. యెహోవా, మన పితరులతో కాదు, నేడు యిక్కడ సజీవులమైయున్న

మనతోనే యీ నిబంధన చేసెను" (ద్వితీ 5:1-3). దీనిని బట్టి ఇశ్రాయేలీయుల పితరులగు అబ్రాహాము, ఇస్సాకు, యాకోబులు సబ్బాతును ఆచరించుట యెరుగరని, మోషే ఈ మాటలు చెప్పుసరికి సజీవులై యున్న ఇశ్రాయేలీయులతో సబ్బాతు ఆచరించుట ఆరంభమైనదని గ్రహించుకొన వచ్చును.

## సబ్బాతు ఎందువలన ?

అయితే ఇంచుమించు 2,500 సంవత్సరముల తరువాత దేవుడు సబ్బాతును గూర్చి ఎందుకు ఇశ్రాయేలీయులను ఆజ్ఞాపించెను ? ఈ ప్రశ్నకు జవాబుగా మనము ద్వితీ 5:15 ను ఇప్పుడు చదువుకొందము: "నీవు ఐగుప్తు దేశమందు దాసుడవై యున్నప్పుడు నీ దేవుడైన యెహోవా బాహుబలముచేతను చాచిన చేతి చేతను నిన్ను అక్కడ నుండి రప్పించెనని జ్ఞాపకము చేసికొనుము. అందుచేతను విశ్రాంతి దినము ఆచరింపవలెనని నీ దేవుడైన యెహోవా నీకు ఆజ్ఞాపించెను". ఐగుప్తు దేశమందు దాసులుగా యెవరుండిరి ? ఇశ్రాయేలీయులా ? అన్యజనులా ? ఇశ్రాయేలీయులేగదా ! అట్లయినప్పుడు ఐగుప్తులో బానిసలుగా యుండని మరెవరికైనను ఈ ఆజ్ఞ వర్తించునా? వర్తించదు. అయితే దేవుడు సబ్బాతును ఆచరింపవలెనని ఎందు నిమిత్తము ఇశ్రాయేలీయుల కాజ్ఞాపించెను ? యెహోవా తన బాహుబలముచేత వారిని దాసత్వమునుండి విడిపించెనని వారు జ్ఞాపక ముంచుకొను నిమిత్తము దేవుడు వారి నాజ్ఞాపించెను. ఇప్పుడు మరొక ప్రశ్న : ఇశ్రాయేలీయులు తప్ప మరెవరైనను ఐగుప్తు దేశపు బానిసత్వము నుండి విడిపించబడిరా ? ఎవరు లేనే లేరు.

కాబట్టి సబ్బాతును ఆచరింపవలెననేడి ఆజ్ఞ ఇశ్రాయేలీయులకేగాని మరెవరికిని వర్తించదు అని నీవు గ్రహించుకొనుము. అది ఇశ్రాయేలీయులకు ఆజ్ఞాపింప బడినందున క్రైస్తవులకు అది వర్తించనే

వర్తించదు. సరిగదా, క్రైస్తవులు మోషే ధర్మశాస్త్రమును బట్టిగాక క్రొత్త నిబంధనను బట్టి నడుచుకొనువారై యున్నారు.

## సబ్బాతు ఆచరించు విధానము

ఇప్పుడుకూడ శనివారమునాడు సబ్బాతును ఆచరించవలెనని బోధించువారు, దేవుడు ఆజ్ఞాపించిన రీతిగ దానిని ఆచరించుట లేనే లేదు. సబ్బాతును ఆచరించువారు శనివార దినమున ఏపనియు చేయరాదు. దేవుని ఆజ్ఞ ఇట్లున్నది : "కావున మీరు విశ్రాంతి దినము నాచరించవలెను. నిశ్చయముగా అది మీకు పరిశుద్ధ దినము;...ఆ విశ్రాంతి దినమున పనిచేయు ప్రతి వాడును తప్పక మరణ శిక్ష నొందును" (నిర్గమ 31:14-16). అట్లయితే శనివారమే ఆరాధన దినమని ఇప్పుడు కూడ వాదించువారు శనివారమున పనిచేయుట మాని వేయుచున్నారా? లేనే లేదు. గనుక దేవుని మాట ప్రకారము వారు తప్పక మరణశిక్ష నొందవలసినదేగదా. అయితే ఆ నిబంధనలో ఎవరెవరున్నారో మనము అపార్థము చేసికొనకుండు నిమిత్తము నిర్గమ 31:17 లో అది నాకును, ఇశ్రాయేలీయులకును ఎల్లప్పుడు గురుతై యుండును అని యెహోవా దేవుడు పలికెను.

"సబ్బాతు దినము నాచరించువారు, విశ్రాంతి దినమున తమ యిండ్లలో ఎక్కడను అగ్ని రాజబెట్టకూడదు" అని నిర్గమ 35:3 లో వ్రాయబడి యున్నది. సబ్బాతు దినము ఇప్పటి కింకను నిలిచియున్నదని బోధించు మన మిత్రులు తమ యిండ్లలో శనివారమునాడు భోజన పానాదులను తయారు చేసికొనుటలేదా? అట్లయితే దేవుని ఆజ్ఞను వారు ప్రత్యక్షముగా ఉల్లంఘించుచున్నారు గదా ! సబ్బాతును దేవుడు ఆజ్ఞాపించిన రీతిగా చేయనివారికి మరణశిక్ష విధింపబడవలెనని దేవుడు చెప్పిన దానిని వారొకసారి జ్ఞాపకము చేసికొనవలెనని హెచ్చరించు చున్నాను. సబ్బాతు దినమున తన పొయ్యి రాజబెట్టు

టకై కట్టెలు ఏరినవానికి ఎట్టిశిక్ష విధింపబడెనో సంఖ్యా 15:32-36 లో వ్రాయబడి యున్నది. "ఇశ్రాయేలీయులు అరణ్యములో ఉన్నప్పుడు ఒకడు విశ్రాంతి దినమున కట్టెలు ఏరుట చూచిరి...తరువాత యెహోవా - ఆ మనుష్యుడు మరణశిక్ష నొందవలెను. సర్వ సమాజము పాళెము వెలుపల రాళ్ళతో వానిని కొట్టి చంపవలెనని మోషేతో చెప్పెను. కాబట్టి యెహోవా మోషేకు ఆజ్ఞాపించినట్లు సర్వ సమాజము పాళెము వెలుపలికి వానిని తీసికొనిపోయి రాళ్ళతో వానిని చావగొట్టెను". సబ్బాతు దినమునాడు కనీసము కట్టెలు ఏరు కొన్న మనుష్యునికి మరణశిక్ష ఆనాడు విధింపబడిన యెడల అంతకంటె ఎన్నోరెట్లు ఎక్కువ పనిని శనివారమునాడు చేయుచున్న మన అడ్వెంటిస్టు మిత్రుల గతి ఈనాడేమై యుండవలసినది ?

అంతేకాదు, సబ్బాతు దినము ఇంకా నిలచియున్నదని బోధించు వారు ఆ దినమున దేవునికి పశుబలుల నర్పించవలసి యున్నది. సంఖ్యాకాండము 28 : 9, 10 లో ఇట్లు వ్రాయబడి యున్నవి : "విశ్రాంతి దినమున నిర్దోషమైన యేడాదివగు రెండు గొర్రెపిల్లలను నైవేద్య రూపముగాను, దాని పానార్పణముగా నూనెతో కలపబడిన తూమెడు పిండిలో రెండు పదియవ వంతును అర్పింపవలెను...యిది ప్రతి విశ్రాంతి దినమున చేయవలసిన దహనబలి". అయితే ఈనాడు జంతు బలులను దేవునికి అర్పించు వారెవరున్నారు? నిశ్చయముగా దేవుని నెరుగనివారేకదా ?

సబ్బాతును గూర్చిన ఆజ్ఞను దేవుడు ఇశ్రాయేలీయులకేగాని మన కియ్యలేదు. ఒకవేళ మనము సబ్బాతును ఆచరించవలెనని ప్రయత్నము చేసినను ఆ దినమందు దేవుడు చెప్పిన దానిని యావత్తును చేయవలెను. లేనియెడల మనము మరణశిక్షకు పాత్రుల మగుదుము. నిజానికి మనము సబ్బాతును ఆజ్ఞాపించు చట్టముక్రింద లేక

దానికంటె శ్రేష్ఠమైన క్రీస్తు చట్టముక్రింద యున్నాము. యేసుక్రీస్తు సబ్బాతు సంబంధమైన చట్టమును మేకులతో తన సిలువకు కొట్టి దానిని మనకు అడ్డము లేకుండా ఎత్తివేసెను. అందువలన క్రైస్తవులు శనివారమున గాక ఆదివారమున దేవుని నారాధించవలెనని ఆయన ఆజ్ఞాపించుచున్నాడు. దీని విషయమైన మరికొన్ని సత్యములను తరువాత సంచికలో నేర్చుకొందము.

—జాషువా గూటం.

— o —

## వ్యధపై విజయము

### ( Winning over Worry )

“నాకు చాల కష్టము లున్నవి. నాకేమైనా సంభవించే దానికి రెండు వారముల ముందునుండియే నేను వ్యథ చెందుచూ యుంటాను” అని ప్రతి చిన్న, పెద్ద విషయములకు యెల్లప్పుడు వ్యథ చెందే ఒక వ్యక్తి చెప్పిన మాటలివి.

ప్రాముఖ్యమైన విషయములను గూర్చిన సరియైన సిద్ధపాటు నిమిత్తము వాటిని గూర్చిన ఆలోచన అవసరమైనదే. వివేకియైన వాడు తన నడతలను బాగుగా కనిపెట్టును (సామెతలు 14:15). అయితే మన ఆలోచనలు, మన తలంపులు మనము యెక్కువగ వాటినిగూర్చి వ్యథ చెందకుండ యుండుటకు ప్రయత్నించవలెను. రాబోయే విషయములను గూర్చిన ఆలోచనలు మనలను భయపెట్టు ఆలోచనలుగ మారుట మిక్కిలి సులభమే. వ్యథ చెందుట అనేది మన సమయమును దొంగిలించును, మన గురిని వేరుచేయును. దీవెనలను పాడుచేయును, మరియు మన ఆరోగ్యమును పాడుచేయును. మన ఆనందాన్ని గూర్చి దేవుడు శ్రద్ధకలిగి యున్నాడు. కాబట్టి ఆయన మనము

చలించకుండ, వ్యధ చెందకుండ యుండుటకు కొన్ని విషయములను యిచ్చి యున్నాడు.

నీవు చేయగలిగినంత మట్టుకు నీ శక్తి లోపములో లేకుండా పనిచేసి మిగిలిన దానిని దేవునికి విడిచిపెట్టుము. దేవుని వాక్యమును చదువుచూ ఆయన యిచ్చిన నియమములను, కట్టడలను అనుసరించు యే వ్యక్తియు తాను చేయు సమస్త కార్యముల యందును దీవింపబడును. అయితే స్వాతంత్ర్యము నిచ్చు సంపూర్ణ నియమములో తేరి చూచి, నిలకడగా నుండువాడెవడో వాడు విని మరచువాడు కాక, క్రియను చేయువాడైయుండి తన క్రియలో ధన్యుడగును (యాకోబు 1:25). దేవుడు మన పనులను దీవించునుగాని మన విచారమును, వ్యధను దీవించడు.

ఒక్కొక్క రోజు చొప్పున జీవించుము. ఈ దినమునకు కావలసిన తొందరలు వాటికవి ఉన్నవి. వాటికి మన శ్రద్ధను, శక్తిని విని యోగించాలను కొనుట అవసరము. రేపటిని గూర్చి చింతింపకుడి, రేపటి దినము దాని సంగతులను గూర్చి చింతించును; ఏనాటి కీడు ఆనాటికి చాలును (మత్తయి 6:34). ఈ దినముకొరకైన ఆలోచనలపై నిన్నటి, రేపటి విషయములను గూర్చిన చింతను బట్టి మన భారములను యెక్కువ చేసికొందుము.

ప్రార్థించండి. దేనిని గూర్చియు చింతపడకుడి గాని ప్రతి విషయములోను ప్రార్థన విజ్ఞాపనములచేత కృతజ్ఞతా పూర్వకముగా మీ విన్నపములు దేవునికి తెలియజేయుడి (ఫిలిప్పీ 4:6). రాజైన హిజ్కియాకు శత్రురాజు నుండి తనపై దండెత్తుననెడి ఉత్తరము వచ్చినప్పుడు అతడు దానిని గూర్చి వ్యసనపడుట మాని ఆ ఉత్తరమును దేవుని సన్నిధిలో యుంచి ప్రార్థించెను. హిజ్కియా దూతల చేతిలోనుండి ఉత్తరము తీసికొని చదివి, యెహోవా మందిరములోనికి

పోయి, యెహోవా సన్నిధిని దాని విప్పి పరచి, యెహోవా సన్నిధిని ప్రార్థన చేసెను (2 రాజులు 19 : 14). దానికి ఫలితముగ దేవుడు శత్రురాజును గుఱ్ఱమును స్వారీచేయువాడు తరుము రీతిగా తరిమెను. మన ప్రతి సమస్యను దేవునికి అప్పగించి ఆయన సహాయము చేయునని నమ్మవలెను.

మొదటి విషయములకు మొదటి స్థానమిమ్ము. ఒక కవి ఈ విధముగ వ్రాయుచున్నాడు : "వ్యథ చెందుట యనేది తలవంగిన వృద్ధుడు తన వీపుపై పక్షి ఈకలను మోయుచు అది సీసము మోయుచున్నానని తలంచినట్లుండును". వ్యథ అనేది స్వల్ప విషయములను గూర్చి కృంగజేసి ప్రాముఖ్యమైన పరలోక విషయములను గూర్చిన ఆలోచన లేకుండ చేయును. అందుకే ప్రభువైన యేసు ఈ విధముగ చెప్పుచున్నారు : "ఆయన రాజ్యమును నీతిని మొదట వెదకుడి; అప్పుడవన్నియు మీ కనుగ్రహింపబడును" (మత్తయి 6:33).

—రోయ్‌స్ ఫ్రెడరిక్

— o —

## శరీర మొక్కటే
## (There is one Body)

"శరీర మొక్కటే...(ఎఫెసి 4 : 4). "శరీరము" అను పదమును ఉపయోగించినపుడు అపొస్తలుడైన పౌలుయొక్క మానసిక భావమేదో తెలుసుకుంటే తప్ప ఈ లేఖనభాగములో ఆ పదముయొక్క సరియైన భావమును గ్రహించలేము. ఇంతకు మునుపే పౌలు ఈ పత్రికలో నిట్లు వ్రాసెను: "మరియు సమస్తమును ఆయన పాదములక్రింద ఉంచి, సమస్తముపైని ఆయనను సంఘమునకు శిరస్సుగా నియమించెను. ఆ సంఘము ఆయన శరీరము. సమస్తమును పూర్తిగా నింపుచున్నవాని సంపూర్ణతయై యున్నది" (ఎఫెసి 1:22, 23).

ఇదే రచయిత క్రీ॥శ॥ 64 సం॥లో దైవావేశముతో కొలస్సయ సంఘమునకు యిట్లు వ్రాసెను: "సంఘమను శరీరమునకు ఆయనే శిరస్సు" (కొలస్స 1:18). ఈ అపొస్తలుడే కొన్ని సంవత్సరములకు ముందు కొరింథులో నున్న ప్రభువు సంఘమునకు యిట్లు వ్రాసెను: "అటువలె మీరు క్రీస్తుయొక్క శరీరమైయుండి వేరువేరుగా అవయవములై యున్నారు" (1 కొరింథీ 1:27). ఈ లేఖన భాగములను మన మనస్సున ధ్యానించినచో శరీరమే సంఘమని అపొస్తలుడు చెప్పుచున్నాడను సంగతి స్పష్టమగుచున్నది. "శరీర మొక్కటే" అను సత్యము నొక్కి చెప్పబడు చున్నది. ఈ క్రింది వాక్యము చదువునపుడు మన అంతరంగ భావము మరింత బలపడును: "తన సిలువ వలన ఆ ద్వేషమును సంహరించి, దానిద్వారా వీరిద్దరిని ఏక శరీరముగా చేసి, దేవునితో సమాధానపరచవలెనని యీలాగు చేసెను గనుక ఆయనయే మనకు సమాధాన కారకుడై యున్నాడు" (ఎఫెసీ 2 : 16).

యేసుయొక్క సిలువకు ముందు "మధ్య గోడ" వలన యూదులు అన్యులు వేరుచేయబడి యుండిరి. క్రీస్తుయొక్క మరణము వలన మధ్యగోడ పడద్రోయబడి యూదులు అన్యులు 'శరీరము'లో సమాధానపడునట్లు సంఘము కొరకు క్రీస్తు రక్తమును చిందించి ప్రాణత్యాగము చేసెను.

## అనేక అవయవములు

సంఘములో అనేక మంది సభ్యు లుందురు. అయినను శరీర మొక్కటే అని బైబిలు బోధించుచున్నది. దైవావేశ పరుడైన రచయిత ఈ సంగతిని ఇట్లు తెల్పుచున్నాడు: "ఒక్క శరీరములో మనకు అనేక అవయవము లుండినను, ఈ అవయవము లన్నిటికిని ఒక్కటే పని యేలాగు ఉండదో, అలాగే అనేకులమైన మనము క్రీస్తులో

బోధను నమ్ముటం, దానిని హత్తుకొనుట వలన మాత్రమే విభజనల సమస్యను పరిష్కరించుకొగలము. శరీర మొక్కటే అను స్పష్టమైన మాట గలదు. కావున సంఘమొక్కటే, ఆ సంఘము ఆయనకే చెందునని దేవుని కుమారుడైన యేసుక్రీస్తు చెప్పుచున్నాడు (మత్తయి 16 : 18).

—చార్లెస్ ఇ కాబ్.

—o—

## సంక్షిప్త వార్తలు

జనవరి నెల సువార్తికుల సదస్సు (Preachers Workshop) మరియు సువార్తకూటము 26వ తేదీన భీమవరం (కళాభవనం వీధి)లో క్షేమాభివృద్ధికరంగా ఆనందదాయకంగా జరిగెను. వివిధ జిల్లాలనుండి అధిక సంఖ్యలో తరలివచ్చిన సువార్తికుల సమక్షంలో, దేవుని వాక్యపు వెలుగులో "రక్షణ పొందుటకు బాప్తిస్మము అవసరమా?" అను అంశము చర్చింపబడెను.

ఉదయం ప్రారంభమైన సమావేశమునకు సోదరులు జి. మర్డక్ గారు (పాలకొల్లు) అధ్యక్షత వహించగా సోదరులు జి.యస్. రావు గారు (మార్టేరు), M.L. క్రిస్టాఫర్ గారు (జొన్నలగరువు), T. ప్రకాశ రావుగారు (కొమరోలు), S. జాకబ్ గారు (పెనుమదం), R. స్టీవెన్ సన్ గారు (గుమ్మలూరు), V. పద్మారావుగారు (నర్సాపురం), K. బాలరాజుగారు (కోరుమిల్లి) మరియు I.J. జయానందంగారు (సూరప్పగూడెం) చర్చలో పాల్గొనిరి. మధ్యాహ్న సమావేశమునకు సోదరులు I.J. జయానందంగారు అధ్యక్షత వహించగా సోదరులు S. ఎబినెజరుగారు, E.K.V. ప్రసాదరావుగారు, బి. యోహానుగారు (పల్లంకుర్రు), పాల్ గూటంగారు ఈఅంశముపై మంచి వివరణనిచ్చిరి.

అబద్ధ బోధలు తీవ్ర ప్రచారంలోనున్న ఈ దినాలలో సత్యాన్వేషుల మనసులలో ఉద్భవించే ప్రశ్న యిది. బాప్తిస్మము రక్షణ

ఒక్క శరీరముగా ఉండి, ఒకనికొకరము ప్రత్యేకముగా అవయవములమై యున్నాము" (1 కొరింథీ 12:4-5). 'శరీర మొక్కటే' నని ఎట్లు నొక్కి పలుకుచున్నాడో గమనించుము. ఆ ఒక్కటే శరీరము క్రీస్తునందు గలదని పేర్కొనినాడు. ఒకడు రక్షింపబడవలెనంటే క్రీస్తునం దుండవలెను.

## క్రీస్తుకు వెలుపల రక్షణ లేదు

అందుచేత ఏర్పరచబడినవారు నిత్యమైన మహిమతో కూడ క్రీస్తు యేసునందలి రక్షణ పొందవలెనని నేను వారి కొరకు సమస్తమును ఓర్చుకొను చున్నాను" (2 తిమోతి 2:10).

క్రీస్తుకు వెలుపల రక్షణ గలదను వాదము మూర్ఖతకు దారి తీయగలదు. పై వాదము ఎంతటి బుద్ధిహీనమైనదో సంఘము క్రీస్తులో గలదను బైబిలు బోధను వ్యతిరేకించుట కూడ అట్లే యున్నది. సంఘమను శరీరమునకు ఆయనే రక్షకుడని బైబిలు తెల్పుచున్నది.

లోకములోనున్న మతశాఖలు విభజనలతో, అసంతృప్తితో కలవరపడుచుండగా, గత రెండువేల సంవత్సరముల నుండి బైబిలు ఏకత్వమును గూర్చి ఎడతెగక బోధించుచున్నది. మనము దేవుని సంతోషపరచవలెనంటే యేసు ప్రార్థించిన ప్రార్థనను ప్రతిబింబింపజేయాలి: "మరియు నీవు నన్ను పంపితివని లోకము నమ్మునట్లు; తండ్రీ, నాయందు నీవును నీయందు నేనును ఉన్నలాగున, వారును మనయందు ఏకమై యుండవలెనని వారికొరకు మాత్రము ప్రార్థించుట లేదు; వారి వాక్యమువలన నాయందు విశ్వాసముంచు వారందరును ఏకమై యుండవలెనని వారికొరకు ప్రార్థించుచున్నాను" (యోహాను 17 : 20, 21).

"శరీర మొక్కటే" అని బైబిలు బోధించుచున్నది. బైబిలు

కొరకు కాదని నేడు అనేకులు బోధించుచున్నారు. అనేక మతశాఖ ప్రముఖులను పరిశీలిస్తే వారు ప్రకటించే రక్షణ సంకల్పములో బాప్తిస్మము అను పదం కనిపించదు. క్రొత్త నిబంధన పరిస్తే బాప్తిస్మము యొక్క ప్రయోజనమును గూర్చి అవసరాన్ని గూర్చి లేఖకులు మనకు అర్థమయ్యే రీతిలో అనేకసార్లు బోధించుట మనం కనుగొన గలము. బాప్తిస్మము రక్షింపబడుటకు (మార్కు 16 : 16; 1 పేతురు 3:21) పాపక్షమాపణ కొరకు (అపొ. కా. 2:38) పాపములను కడిగి వేసికొనుటకు (అపొ.కా. 22:16), క్రీస్తులోనికి (గలతి 3:27) క్రీస్తును ధరించుకొనుటకు (గలతీ 3 : 27) క్రీస్తు మరణ, సమాధి పునరుత్థాన ములలో పాలు పొందుటకు (రోమా 6:3-6) క్రీస్తు శరీరములోనికి (సంఘములోనికి) లేదా ఒక్క శరీరముగా ఉండుటకొరకు మరియు దేవుని రాజ్యములో ప్రవేశించుట కొరకు (యోహా 3:5) అని లేఖ నములు వివరిస్తుండగా రక్షింపబడుటకు బాప్తిస్మము అవసరం లేదను బోధ, రక్షింపబడినవారు బాప్తిస్మము పొందవలెనను బోధ ఎక్కడిది? కేవలము కల్పితమైనది, దయ్యముల బోధ మరియు సత్యవిరోధమైనది. దేవుడు తన సంకల్పములో రక్షణకు ముందు బాప్తిస్మము నుంచెను. మానవుడు బాప్తిస్మమునకు ముందే రక్షణ పొందాలని బోధిస్తున్నాడు. యింత తేటగా లేఖనములు సత్యాన్ని ప్రకటిస్తుంటే ఎందుకు మీరు ప్రభువు మాటలకు విధేయులు కాకూడదు? అని మంచి పాఠములను సోదరులు అందించిరి.

'బాప్తిస్మము' అను పదం 'బాప్టిజో' అను గ్రీకుపదం నుండి అనువదింపబడింది. దీనికి 'ముంచుట' అని అర్థము. పరిశుద్ధాత్మ బాప్తిస్మము అపొస్తలుల కివ్వబడిన వాగ్దానము, అది ఆజ్ఞ కాదు. క్రీస్తు మరణ సమాధి పునరుత్థానములలో మనలను పాలివారిని చేసే బాప్తిస్మము క్రీస్తు మరణము తరువాత అమలులోనికి వచ్చింది.

సోదరులు పాల్ గూటంగారు మాటలాడుచు సిలువపైనున్న దొంగ సిలువపై మరణించు సమయానికి క్రొత్త నిబంధన అమలు

లోనికి రాలేదని చెప్పిరి. చెరసాల నాయకునితో పౌలు 'ప్రభువైన యేసునందు విశ్వాస ముంచుము' అని చెప్పెను. చెరసాల నాయకుడు ఒక్కడే విశ్వసిస్తే అతని కుటుంబము (ఇంటివారు) ఎట్లు రక్షింపబడ గలరు? విశ్వాసము ప్రాథమిక ఆజ్ఞ. విశ్వాసము మాత్రమే రక్షించదు. అందుచేతనే అతడును అతని యింటివారును బాప్తిస్మము పొంది రక్షింప బడిరి. బాప్తిస్మము మాత్రమే రక్షించునని బైబిలు బోధించుట లేదు. విశ్వాసము, మారుమనస్సు, ఒప్పుకొనుట, బాప్తిస్మము రక్షణకొరకు దేవుడిచ్చిన ఆజ్ఞలు అని చెప్పిరి.

రాత్రి కూటమునకు సోదరులు ఇ. కె.వి. ప్రసాదరావుగారు అధ్యక్షత వహించగా సోదరులు డి. ప్రభుదాస్‌గారు (భీమవరం), డి. ఎలీషాగారు (మొగల్తూరు) మరియు పాల్ గూటంగారు చక్కని సందేశమందించిరి. సుమారు 200 మంది రాత్రికూటమునకు హాజరై దేవుని వాక్యము విని ఆనందంతో తమ గృహాలకు కూటము అనంతరం తిరిగి వెళ్ళిరి. సోదరులు వాసా ప్రసాదరావుగారు భీమవరంలో దేవుని పనిని విశ్వాసముతో జరిగించుచున్నారు. ఫిబ్రవరి నెల ప్రీచర్స్ వర్క్‌షాప్ మరియు సువార్త కూటము 22వ తేదీనాడు ఆచంట సమీపములోనున్న కరుగోరుమిల్లిలో జరుగును. అక్కడ సోదరులు N. మోజెస్‌గారు సువార్తపని చేయుచున్నారు. అందరికీ మా ఆహ్వానము.

Regd. No. H/KD—45/KD H.O

From
SATYAVAKKU
P.O. Box 80
KAKINADA 533 001

No.

To